క్లుప్తంగా

ఆర్లిలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలు



ఆరోగ్య పరీక్షలను నిర్వహిస్తున్న వైద్యాధికారి నిర్మల

కె.కోటపాడు: ఆర్లి గ్రామంలో చౌడువాడ పీహెచ్‌సీ సిబ్బంది సోమవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్యసేవలు నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ నిర్మల పాల్గొని, 132 మందికి వైద్య పరీక్షలు జరిపి, ఉచితంగా మందులు అందించారు. గర్భిణులకు ప్రత్యేక ఆరోగ్య తనిఖీలతో పాటు బీపీ, సుగర్ పరీక్షలు జరిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది డీఎస్ఎన్ రాజు, రమణ పాల్గొన్నారు.

మాడుగుల సంతలో పనస పండ్లకు గిరాకీ



మాడుగుల వారపు సంతలో పనస పండ్లు

మాడుగుల: స్థానిక వారపు సంతలో పనస పండ్లకు సోమవారం గిరాకీ పెరిగింది. ఒక్కో పనస పండు రూ.200 నుంచి రూ.400 వరకు ధర పలికింది. దీంతో కొనుగోలు దారులు కాస్త వెనుకడుగు వేశారు. సీజన్ ప్రారంభం కావడంతో అరకొరగా సంతకు పండ్లు వచ్చాయి. దీంతో ఈ పండ్లకు గిరాకీ పెరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. దేవాపురం గిరిజన గ్రామాల నుంచి వచ్చే పనస పండ్లు రుచిగా ఉండడంతో వీటిని కొనుగోలు చేసేందుకు దూర ప్రాంతాల నుంచి వస్తున్నారు. గతేడాది కంటే ముందుగానే ఈ ఏడాది పనస పండ్లు సంతలో కనువిందు చేశాయి.

సబ్సిడీపై వరి విత్తనాల పంపిణీ



వడ్డాదిలో రైతులకు విత్తనాలు అందిస్తున్న రైతు సంఘ నాయకులు

బుచ్చెయ్యపేట: ఖరీఫ్ వరి విత్తనాల పంపిణీని అధికారులు చేపట్టారు. సోమవారం మేజర్ పంచాయతీ వడ్డాదిలో ప్రభుత్వం రాయితీపై అందించిన వరి విత్తనాలను రైతు సంఘ నాయకుల చేతుల మీదుగా పలువురు రైతులకు అందించారు. రైతులు తమకు అవసరమైన సాంబమసూరి, ఆర్‌జీఎల్, సోనామసూరి తదితర రకాల విత్తనాలను కొనుగోలు చేశారు. రైతులకు అవసరం మేరకు విత్తనాలను అందుబాటులో ఉంచాలని రైతు సంఘ నాయకులు దొండా సన్యాసిరావు, దొండా నరేష్, శిరిగిరిశెట్టి దొరపిల్ల, దొండా నారాయణమూర్తి, దాడి సూరినాగేశ్వరరావు, అడపా నరిసింహమూర్తి, వీర్ల సురేష్, కోరుకొండ రమణ తదితరులు అధికారులను కోరారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు



కె.జె.పురం శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మాడుగుల రూరల్: శివాలయాలల్లో శివుడికి ప్రీతికరమైన సోమవారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కేజే పురం, జంపెన, వీవీ అగ్రహారం, దబ్బకుంట రహదారిలోని ఉమా భీమలింగేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేజే పురం శివాలయంలో రోజూ ఉదయం ఉమా భీమలింగేశ్వరుడికి పూజలు జరిపి, రాత్రి 7 గంటల నుంచి భజన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు స్థానిక గౌరీ భజన సేవా కమిటీ ప్రతినిధులు తెలిపారు. దాతల సహకారంతో చద్ది వితరణ చేస్తున్నామన్నారు.

రిజిస్ట్రేషన్ చేసుకోండి.. రాయితీ విత్తనాలు పొందండి

- ఆర్బీకేల్లో అందుబాటులో రాయితీ వరి విత్తనాలు
- ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన విత్తనాల పంపిణీకి ఏర్పాట్లు
- మండల వ్యవసాయ అధికారి వై.కాంతమ్మ



దేవరాపల్లి ఆర్బీకేలో విత్తనాల కోసం రైతులకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపడుతున్న సిబ్బంది

దేవరాపల్లి: ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న నాణ్యమైన, ఖరీఫ్ వరి విత్తనాల కోసం రైతులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి వై.కాంతమ్మ తెలిపారు. రైతు భరోసా కేంద్రా(ఆర్బీకే)ల్లో విత్తనాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. స్థానిక ఆర్బీకేల్లో ఆన్‌లైన్ ద్వారా రైతులు తమకు కావాల్సిన విత్తనాల కోసం పేర్లను నమోదు చేసుకుని, విత్తనాలకు సంబంధించిన నగదును అక్కడే చెల్లించాలని సూచించారు. ఈ మేరకు మండల వ్యాప్తంగా అన్ని ఆర్బీకేల్లో సోమవారం ప్రారంభించిన విత్తనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పర్యవేక్షించారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తికాగానే విత్తనాలను పంపిణీ చేస్తామన్నారు.

అందుబాటులో ఉన్న విత్తనాలు

మండలంలోని 20 ఆర్బీకేల్లో బీపీటీ-5204(సాంబ మసూరి) రకం వరి విత్తనాలు 155 క్వింటాళ్లు, ఎంటీయూ-1121(శ్రీధ్రుతి) రకం 383 క్వింటాళ్లు, ఎంటీయూ-1064(అమర) రకం 112.4 క్వింటాళ్లు, బీపీటీ-3291(సోనామసూరి) రకం 37 క్వింటాళ్లు, ఆర్‌జీఎల్-2537(శ్రీకాకుళం సన్నాలు) రకం 360 క్వింటాళ్లు, ఎంటీయూ-1318 రకం 41 క్వింటాళ్లు, ఎంటీయూ-7029 స్వర్ణ 89 క్వింటాళ్లు, ఎంటీయూ 1224 రకం వరి విత్తనాలు 118 క్వింటాళ్లు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. ఆన్‌లైన్‌లో ఆధార్‌కు అనుసంధానమైన భూమి ఆధారంగా రైతుకు అవసరమైన విత్తన బస్తాలను అందించనున్నట్లు పేర్కొన్నారు. వరి విత్తనాలు కేజీకి పది రూపాయలు చొప్పున ప్రభుత్వం రాయితీ అందిస్తుందన్నారు. ఆమె వెంట మండల వ్యవసాయ విస్తరణ అధికారి ఎస్.కిరణ్‌కుమార్, దేవరాపల్లి అగ్రికల్చర్ అసిస్టెంట్ కె.సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ వరి విత్తనాల ధరలు

విత్తన రకం	బస్తా(కేజీల్లో)	అసలు ధర	రాయితీ ధర
బీపీటీ-5204	25	1,045	795
ఎంటీయూ-1121	30	1,194	894
ఎంటీయూ-1064	30	1,194	894
బీపీటీ-3291	30	1,134	834
ఆర్‌జీఎల్-2537	30	1,254	954
ఎంటీయూ-1318	30	1,194	894

మార్షల్ ఆర్ట్స్‌లో సర్టిఫికెట్లు ప్రదానం



శిక్షణ పొందిన విద్యార్థులతో అకాడమీ ప్రతినిధులు, కోచ్ ప్రసాద్

నర్సీపట్నం: మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందిన చిన్నారులకు ఆర్వీ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ సోమవారం సర్టిఫికెట్లు ప్రదానం చేసింది. రైయోన్ రియు ఫోటోకన్ కరాటే డూ ఇండియా సౌజన్యంతో అకాడమీ ఆధ్వర్యంలో సమ్మర్ కోచింగ్ ద్వారా 75 మంది విద్యార్థులకు కరాటేలో ఉచిత శిక్షణ ఇచ్చారు. అకాడమీ చైర్మన్ వెలగా నారాయణరావు, బోర్డ్ డైరెక్టర్లు నాగజ్యోతి, నవ్య, ప్రెసిడెంట్ రమేష్ చేతుల మీదుగా శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా నారాయణరావు మాట్లాడుతూ చదువుతో పాటు విద్యార్థులకు మార్షల్ ఆర్ట్స్ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఆడపిల్లలకు మార్షల్ ఆర్ట్స్ రక్షణ కవచంలా ఉంటుందన్నారు. కోచ్ ఆర్.ప్రసాద్ మాట్లాడుతూ శిక్షణ శిబిరానికి విద్యార్థుల తల్లిదండ్రుల నుండి విశేష స్పందన లభించిందని ఆనందం వ్యక్తం చేశారు. రైయోన్ రియు ఫోటోకన్ కరాటే-డూ ఇండియా ద్వారా ఈ సర్టిఫికెట్లు అందించామన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆర్బీకేకు చేరిన విత్తనాలు



చీడికాడ ఆర్బీకేలో సిద్ధంగా ఉన్న వరి విత్తనాలు

చీడికాడ: ఖరీఫ్ సాగుకు అవసరమైన వరి విత్తనాలు ఆర్బీకేల్లో పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు ఇన్‌చార్జి ఏవో రమాదేవి సోమవారం తెలిపారు. మండలంలోని 13 ఆర్బీకేల్లో రాయితీపై అందించేందుకు ఆర్‌జీఎల్, బీపీటీ, ఆర్ఎన్ఆర్, ఎంటీయూలో 6 రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. విత్తనాల కోసం ఆర్బీకేల్లో డి కృషి యాప్‌లో నమోదు చేసుకున్న రైతులందరికి అందిస్తామన్నారు.

గర్భిణులకు ఆరోగ్య తనిఖీలు



కేజే పురం పీహెచ్‌సీలో గర్భిణీ బీపీ చెక్ చేస్తున్న ఆశ కార్యకర్త

మాడుగుల రూరల్: కె.జె.పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం గర్భిణులకు ప్రత్యేక ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. ప్రధాన మంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రతి నెల 9న గర్భిణులకు వైద్య పరీక్షలు జరుపుతారు. ఈ నెల 9వ తేదీ ఆదివారం కావడంతో, ఈ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. చోడవరం ప్రభుత్వ ఆస్పత్రి ప్రసూతి వైద్య నిపుణులు ప్రియాంక 19 మంది గర్భిణులను పరీక్షించి, తగు సూచనలు, సలహాలు అందించారు. పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ అధికారిణి సి.హెచ్. పుష్పమ్మ పర్యవేక్షణలో స్థానిక ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, సిబ్బంది వైద్య పరీక్షలు జరిపారు. అవసరమైన మందులు అందించారు. కింతలి పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య సిబ్బంది ఆరోగ్య తనిఖీలు చేశారు.



గర్భిణులకు ఆరోగ్య సూచనలిస్తున్న హెల్త్ సూపర్‌వైజర్ సన్యాసిరావు

కె.కోటపాడు: గర్భిణులు మంచి పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకుంటే ఆరోగ్యవంతులైన బిడ్డలు జన్మిస్తారని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి శైలజ తెలిపారు. స్థానిక పీహెచ్‌సీలో సోమవారం ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో భాగంగా 34 మంది గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు జరిపి, మందులు అందించారు. అవసరం గల గర్భిణులకు స్కానింగ్ పరీక్షల కోసం కె.కోటపాడు సీహెచ్‌సీకి రిఫర్ చేశారు. ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలు జరిగితే తల్లీబిడ్డలు క్షేమంగా ఉంటారని హెల్త్ సూపర్‌వైజర్ జె.సన్యాసిరావు సూచించారు. ఆకుకూరలు, పప్పు దినుసులతో కూడిన ఆహారాన్ని తీసుకుంటే గర్భిణుల్లో రక్తహీనత సమస్య ఉండబోదన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

తుమ్మపాల: వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ సహకారంతో తుమ్మపాలలోని పోలిపల్లెమ్మ వారి ఆలయం వద్ద ఈ నెల 12న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వాకర్స్ క్లబ్ ప్రెసిడెంట్ వై.సత్యనారాయణ తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి శిబిరం ప్రారంభమవుతుందన్నారు. శంకర్ ఫౌండేషన్ వైద్యులు రోగులను పరీక్షించి జాగ్రత్తలు, సూచనలు తెలుపుతారన్నారు. కంటి చూపు సమస్యలు ఉన్న గ్రామస్తులు, వృద్ధులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం



కోటవురట్ల మెయిన్‌రోడ్డులో విద్యుత్ స్తంభంపై చెలరేగుతున్న మంటలు

కోటవురట్ల: త్రుటిలో పెద్ద ప్రమాదం తప్పింది. అధికారులు సకాలంలో స్పందించడంతో పెను ప్రమాదం తప్పింది. మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంకు సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభంపై సోమవారం మధ్యాహ్నం మంటలు చెలరేగాయి. పక్షి గూళ్లకు షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు వ్యాపించాయి. పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడడంతో స్థానికులు పరుగులు తీశారు. వెంటనే విద్యుత్ శాఖాధికారులకు సమాచారం ఇవ్వడంతో విద్యుత్ సరఫరా నిలిపివేసి ప్రమాదాన్ని నిలువరించారు. దాంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి



మాట్లాడుతున్న కాసారపు సత్యనారాయణ

అనకాపల్లి: రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ శాఖలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ విధానం రద్దు చేసి కార్మికులను పర్మినెంట్ చేయాలని జీవీఎంసీ మున్సిపల్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ (ఏఐటీయూసీ) వర్కింగ్ ప్రెసిడెంట్ కాసారపు సత్యనారాయణ డిమాండ్ చేశారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో సోమవారం జరిగిన అనకాపల్లి జోన్ సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. జోన్ గౌరవాధ్యక్షుడు కోన లక్ష్మణ మాట్లాడుతూ రాష్ట్రంలో అతిపెద్ద కార్పొరేషన్‌గా పేరొందిన జీవీఎంసీలోని ఉద్యోగులకు 010 పద్దు ద్వారా వేతనాలు ఇవ్వాలని, సీఎఫ్ఎంఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు తెద్దు వెంకటేశ్వర్లు, మున్సిపల్ యూనియన్ నాయకులు బంగారు రవికుమార్, చిన్ని, అజయ్, నిమ్మకాయల కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి

అచ్యుతాపురం : అచ్యుతాపురం మండలంలోని హరిపాలెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మలేరియా నివారణ మాసోత్సవ సదస్సు సోమవారం నిర్వహించారు. వైద్యాధికారి కళ్యాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో భాగంగా దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని, నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ఆరోగ్య పర్యవేక్షకులు సునీత,ఉమా మహేశ్,సిబ్బంది శాంతి, గణేశ్, ఇందిర, ముఖేశ్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

34 వేల ఎకరాల్లో వరి సాగుకు సిద్ధం

పాయకరావుపేట : పాయకరావుపేట వ్యవసాయ శాఖ డివిజన్ పరిధిలో గల 5 మండలాల్లో రైతులు 34 వేల ఎకరాల్లో వరి పంటను వేయడానికి సిద్ధంగా ఉన్నారని వ్యవసాయ శాఖ ఏడీ కె.ఉమాప్రసాద్ తెలిపారు. డివిజన్ పరిధిలో పాయకరావుపేట, నక్కపల్లి, కోటవురట్ల, నాతవరం, మాకవరపాలెం మండలాల్లో రైతులకు వరి విత్తనాల సరఫరాకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించడం జరిగిందన్నారు. పాయకరావుపేట మండలంలో గల రైతులకు 851 క్వింటాళ్ల వరి విత్తనాలు, నాతవరానికి 1770 క్వింటాళ్లు, నక్కపల్లి 777 క్వింటాళ్లు, కోటవురట్లకు 772 క్వింటాళ్లు, మాకవరపాలెం మండలానికి 885 క్వింటాళ్లు వరి విత్తనాలకు ప్రతిపాదనలు పంపించడం జరిగిందన్నారు. వారం రోజుల్లో వరి విత్తనాలు ఆయా మండల కేంద్రాలకు చేరుకుంటాయన్నారు. రైతులకు అవసరమయ్యే ఆర్‌జీఎల్, సాంబమసూరి, ఇంద్ర, ఎంటీయు, రకాల్లో విత్తనాలు సరఫరా చేయడం జరుగుతుందన్నారు. అదే విధంగా వరి పంట వేసే ముందు 45 రోజులు ముందుగా వేయవలసిన పచ్చిరొట్ట విత్తనాలైన పిల్లిపెసర, జీలుగ, జనుము విత్తనాలు కూడా ఆయా మండలాలకు చెందిన గ్రామాల్లో గల రైతు భరోసా కేంద్రాల్లోను ప్రస్తుతం రైతులకు సరఫరా చేయడం జరుగుతుందన్నారు. పాయకరావుపేట, నక్కపల్లి, నాతవరం, కోటవురట్ల, మాకవరపాలెం మండలాల రైతులకు ఇప్పటికే పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ, జనుము, పిల్లిపెసర విత్తనాలు రైతులకు సరఫరా చేస్తున్నట్టు తెలిపారు.

అలరించిన గీతాలు



విజేతలతో ఈశ్వరరావు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం గౌరీగ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పాటల పోటీలు ఆహూతులను అలరించాయి. ఈ పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా 40 మంది గాయకులు పాల్గొని, గీతాలు ఆలపించారని జీఆర్‌కే స్వరగమనం సంస్థ వ్యవస్థాపకుడు గేదెల ఈశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా భవిత స్కూల్ ఆఫ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో చిన్నారులు పాశ్చాత్య, జానపద, శాస్త్రీయ నృత్యాలు ప్రదర్శించారు. విజేతలకు ఈశ్వరరావు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో అకాడమీ వ్యవస్థాపకులు పెంటకోట లీలావతి, గాయకులు అజయ్, బాలకృష్ణ, గౌరీ, శ్రీనివాస్, రాము, శంకర్, ధరణి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు వేగవంతం చేయాలి

మునగపాక : ప్రభుత్వ భూముల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని తహసీల్దార్ పాపారావు కోరారు. ప్రజలకు రెవెన్యూ పరమైన సేవలను సత్వరమే అందించాలన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యాలయానికి వచ్చే ప్రతి ఒక్కరికీ సకాలంలో సేవలందించాలన్నారు. రెగ్యులర్ ధ్రువపత్రాల కోసం వచ్చే వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా సత్వరమే చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు ఉన్నత తరగతుల ప్రవేశాలను దృష్టిలో పెట్టుకుని చొరవ చూపాలన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేయాలన్నారు. డీటీ వినయ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు, ఆర్ఐ కిషోర్ సమావేశంలో పాల్గొన్నారు.

ఘనంగా వినాయక ఆలయ ప్రథమ వార్షికోత్సవం



ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న హోమంలో భక్తులు, పురోహితులు



వినాయకుడిని దర్శించుకుంటున్న భక్తులు

నాతవరం: మండల కేంద్రంలోని శ్రీవినాయక ఆలయం ప్రథమ వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. స్థానిక ఇందిరమ్మ మోడల్ కాలనీలో ప్రభుత్వం రూ.10 లక్షలు మంజూరు చేయడంతో ఈ ఆలయాన్ని నిర్మించారు. గతేడాది ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు. ఆనాటి నుంచి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సోమవారం ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా వేద పండితులచే హోమాలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. స్వామిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు రావడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయంలో సందడి నెలకొంది. మధ్యాహ్నం ఆలయ భారీ అన్నసమారాధన జరిపారు. సాయంత్రం భజనలు, మహిళల కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇంతవరకు కాలనీలో హిందూ ఆలయాలు లేవని, ఈ ఆలయ నిర్మాణంతో ఇందిరమ్మ కాలనీ ప్రజల్లో భక్తి భావం పెరిగిందని స్థానికులు ఆనందంగా చెప్పన్నారు.

మలేరియా నియంత్రణపై అవగాహన ర్యాలీ



మాడుగులలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ఆరోగ్య, ఆశ కార్యకర్తలు

మాడుగుల రూరల్: మలేరియా వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కె.జె.పురం పీహెచ్‌సీ ఆరోగ్య పర్యవేక్షకులు వెంకట్రావు కోరారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా మాడుగుల బస్టాండులో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ నెల 1 నుంచి 30 వరకు మలేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా మలేరియా వ్యాధి వ్యాప్తి కారకాలు, నివారణ గురించి గ్రామాల్లో ఆరోగ్య, ఆశ కార్యకర్తల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. మురుగు కాలువల్లో నిల్వ నీరు ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక ఆరోగ్య సహాయకులు శ్రీనివాసరావు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలు, పాల్గొన్నారు.

పంపిణీకి సిద్ధంగా పాఠ్య పుస్తకాలు



పాఠ్య పుస్తకాలను కట్టలు కడుతున్న సీఆర్పీలు

మాడుగుల రూరల్: మరో మూడు రోజుల్లో వేసవి సెలవులు ముగిసి, ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. దీంతో పాఠ్య పుస్తకాల పంపిణీకి మండల విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. ప్రస్తుతం మండలానికి చేరిన పాఠ్య పుస్తకాలను సీఆర్పీలు స్కూళ్లవారీగా కట్టలు కడుతున్నారు. మండలంలో 1 నుంచి 10వ తరగతి వరకు 5,941 మంది విద్యార్థులున్నారు. పదో తరగతికి 11 టైటిళ్లు వచ్చాయి. అన్ని తరగతులకు కలిపి కొన్ని పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ రావాల్సి ఉంది. వచ్చిన మేరకు పాఠ్య పుస్తకాలను మండల విద్యాశాఖ కార్యాలయంతో పాటు స్థానిక జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో భద్రపరిచారు. యూనిఫాం ఇంకా రాలేదని ఎంఈవోలు దేముడమ్మ, పాండురంగారావులు తెలిపారు. మిగిలిన పాఠ్య పుస్తకాలు, యూనిఫారం కూడా త్వరలోనే వస్తాయని చెప్పారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్‌ను పాఠశాలల వారీగా పంపిణీకి సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు.

ప్రైవేట్ స్కూళ్లలో వసతులపై సమీక్ష



ప్రైవేట్ స్కూళ్ల నిర్వాహకులతో ఎంఈవో జానుప్రసాద్, త్రిసభ్య కమిటీ సభ్యులు

రోలుగుంట: ప్రైవేట్ స్కూళ్లలో విద్యార్థులకు అవసరమైన వసతులను పూర్తి స్థాయిలో కల్పించాలని యాజమాన్యాలకు మండల విద్యాశాఖాధికారి జానుప్రసాద్ ఆదేశించారు. పాఠశాలల పునఃప్రారంభం నేపథ్యంలో మండలంలోని ప్రైవేట్ స్కూళ్లపై ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీ స్పెషల్ డ్రైవ్ నిర్వహించి, వసతులపై నివేదికలను ఎంఈవోకి అందించింది. ఈ మేరకు ఎంఈవో సోమవారం ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలతో సమీక్షించారు. నివేదిక ఆధారంగా జె.నాయుడుపాలెం, బుచ్చింపేట ప్రైవేట్ స్కూళ్లలో రన్నింగ్ వాటర్, పూర్తి స్థాయిలో బెంచీలు, బల్లలు తదితర వసతుల లేమిని గుర్తించి, త్వరితగతిన ఏర్పాటు చేయాలని సూచించారు. రికార్డులు సక్రమంగా నిర్వహించి, విద్యార్థులకు మేలైన విద్యను అందించేలా అర్హులైన ఉపాధ్యాయుల్ని నియమించాలని సూచించారు. సమావేశంలో త్రిసభ్య కమిటీ సభ్యులు ఎంఈవో-2 జగ్గారావు, వెంకట్రావు. మోహన్, బుచ్చింపేట, కుసుర్లపూడి, జె.నాయుడుపాలెం, రోలుగుంటలోని ప్రైవేట్ స్కూళ్ల నిర్వాహకులు పాల్గొన్నారు.

చెరువులు నిండిన గ్రామాల్లో ప్రత్యామ్నాయ 'ఉపాధి'



సరుగుడు పంచాయతీలో పనులు చేస్తున్న ఉపాధి కూలీలు



జె.పి.అగ్రహారంలో పంట భూమిలో కందకాల పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

రోలుగుంట: చెరువులు నిండిన గ్రామాల్లో ఉపాధి పథకం కింద ప్రత్యామ్నాయ పనులు కల్పిస్తున్నట్లు ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో సూర్యమణి తెలిపారు. ఉపాధి పథకం ద్వారా మండలంలోని జేపీ అగ్రహారం, పడాలపాలెం, అర్ల తదితర గ్రామాల్లో జరుగుతున్న భూ అభివృద్ధి పనులను సోమవారం పరిశీలించారు. సాంకేతిక సహాయకులు రాము, దినేష్, అసిరయ్యలకు పలు సూచనలిచ్చారు. భూముల్లో నిర్ణీత దూరంలో కందకాలను తవ్వించాలన్నారు. నీటి నిల్వలకు అనువుగా ఉండేలా గోతుల లోతు ఉండాలన్నారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఇటీవల కురిసిన వర్షాలకు కొన్ని గ్రామాల్లో చెరువులు నిండాయని, దీంతో చెరువు అభివృద్ధి పనులు చేయించలేమన్నారు. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ పనుల ద్వారా కూలీలకు ఉపాధి కల్పించే చర్యలు చేపట్టామన్నారు. భూఅభివృద్ధి పనులు, పండ్ల తోటల్లో కందకాలు, కొండ ప్రాంతంలో నీటి నిల్వలుండేలా అవకాశాన్ని బట్టి చిన్నపాటి చెరువుల తవ్వకాల పనులు చేయిస్తున్నామన్నారు. కూలీలు, రైతు కూలీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

గిరిజన భూముల్లో రాతిపేర్పు, ట్రెంచ్ పనులు

నాతవరం: ఉపాధి హామీ పథకంలో భాగంగా గిరిజన గ్రామాల్లోని వ్యవసాయ భూముల్లో రాతిపేర్పు పనులు చురుగ్గా జరుగుతున్నాయని ఎంపీడీవో జాగరపు రాంబాబు అన్నారు. సోమవారం ఆయన సరుగుడు పంచాయతీలో ఉపాధి పనుల్ని పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ ప్రాంతంలో అధికంగా ఉన్న గిరిజన రైతులు తమ భూముల్లో రాతిపేర్పు/ట్రెంచ్ పనులను అడుగుతున్నట్లు తెలిపారు. వారి అభీష్టం మేరకే ఆయా పనులకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువుల్లో నీరు చేరడంతో పనులు చేసేందుకు అవకాశం లేకపోయిందదన్నారు. దీంతో రాతిపేర్పు, ట్రెంచ్ పనులతో పంట కాలువల్ని అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట ఉపాధి హామీ పథకం సిబ్బంది ఉన్నారు.